నేను అతి దగ్గరగా చూసిన సినీ కొరియోగ్రాఫర్ల వ్యక్తిత్వపు కోణాలను,
క్షణభంగురమైన జీవితాలను, ఆవేశకావేషాలను ఆవిష్కరించే ప్రయత్నం చేసాను.
ఇది కేవలం నృత్యానికి సంబంధించిన కథ మాత్రమే కాదు.
ఇద్దరి ప్రేమ, గెలుపు, ఓటమి, సినీ జగత్తులో విహరించే
వాళ్ల కలలు, నీడల గాథ.

చరణ్ పరిమి

# 6 వింగ్స్ & షాడోస్

చరణ్ పరిమి





"ఏం పేరురా... ఆ గుర్తొచ్చింది. జ్యో... జ్యోతి. దాని వెనకాల తిరిగితే జాక్సన్‌గాడు ఇంటికిపోవడం ఖాయం అని అప్పుడే చెప్పా. అలాగే అయ్యింది," బార్‌లో ఎదురుగా సైడ్ డాన్సర్ వాగాడు.

జాక్సన్ చేతిలో బీరు బాటిల్ అతని తలమీద పగిలింది. గొడవ మొదలయింది. సవేరా బార్ నుంచి జాక్సన్‌ని బయటికి తోసేశారని రోడ్డుమీద కారు హారన్ గుర్తుచేసింది. లేచి దులుపుకొని వెళ్లిపోయాడు జాక్సన్.

చాలా ఏళ్లుగా అతను ఎవరికైనా తాగకుండా కనపడలేదు. ఆ రాత్రి ఎప్పుడు ఇంటికి చేరుకున్నాడో తెలియదు.

ఫోన్‌లో మోగిన పాట అతన్ని నిద్ర లేపింది. లేచిన మరుక్షణం జీవితం చేదుగా గుర్తొస్తుంది. ఇంకో పెగ్‌తో తీపి చేసుకుంటాడు. డాన్సర్‌గా అతను సాధించిన అవార్డులు, రివార్డులు షెల్ఫ్‌లో బూజు పడుతూ కనిపించాయి. పెద్దపెద్ద హీరోలతో దిగిన ఫొటోలు గోడలు ఎక్కలేక మూలనపడి ఉన్నాయి.

తన ఐ20 కారుతో ఫోజులు మాత్రమే మిగిలాయి. ఈ మనిషీ, ఆ ఫొటోల్లో ఉన్న వ్యక్తీ ఒకరు కాదేమో అనిపిస్తుంది. నిజాన్ని మార్చలేము. అతను ఇతనే, జాక్సన్.

గణపతి కాంప్లెక్స్ దగ్గర్లో ఒక పాత అపార్ట్‌మెంట్ మూడో ఫ్లోర్‌లోని సింగిల్ బెడ్రూం ఫ్లాట్ అతని ప్రస్తుత అడ్రస్.

లేవగానే మొబైల్‌లో ఫ్రంట్ కెమెరా ఆన్ చేసాడు. ముక్కు దాటిన జుట్టులో నుంచి మొహాన్ని చిరాగ్గా చూసాడు. కేశాల్లో తెలుపునీ మొహంలో నలుపునీ చూసుకున్నాక కొన్ని నిమిషాలు లోకం ఆగిపోయి మళ్లీ కదిలింది.

"మాస్టర్, నీ జుట్టు తెల్లబడింది. నువ్వు ముసలోడికి అయ్యావు, ఇక డాన్స్‌లో ఫ్లోర్ మూమెంట్స్ కష్టం హి... హ్హా... హ్హీ..." తన మేకగడ్డాన్ని గోక్కుంటూ అన్నాడు మాస్టర్ అసిస్టెంట్ బన్నీ. టీనేజ్ దాటుతున్నాడు.

మాస్టర్ వాణ్ణి విసుగ్గా చూసాడు. క్షణాల్లో జులపాల మీద ఇండికా హెయిర్ డై నాట్యమాడింది. అప్పుడు ఫార్టీ నుంచి థర్టీకి వచ్చా అనుకుంటాడు. తృప్తిగా నవ్వాడు.

బన్నీ అంతా ఓపిగ్గా చూసి, "మాస్టర్ ఆ చేతికి టాటూలు, చెవిపోగు, మెడలో పొడవాటి సిల్వర్ చెయిన్, ఇదంతా వయసు కవర్ చేయడానికే కదా," మళ్ళీ పొడిచాడు.

"ఒరేయ్... ఇక్కడ ఎంత వెరైటీగా కనబడితే డ్యాన్సర్‌గా అంత అటెన్షన్ వస్తుందిరా. ఇక్కడ నా అంత తోపు డాన్సర్ ఎవరురా. నేను ఎలా ఉంటే అదే స్టైల్," మాస్టర్.

బన్నీ ఆయన మాటలకు వింతగా చూసాడు.

జాక్సన్ మూలన ఉన్న స్టాండ్‌ను చూసి కంగారుగా,

"ఈ స్టాండ్ మీద ఫొటోస్ ఉండాలి, ఏమయ్యాయి?"

"రాత్రి కిక్కులో తమరు తగులబెట్టేశారుగా," బన్నీ.

"నేనా!"

"మరి నేనా!" మూలనున్న ఖాళీ మందుబాటిల్స్ మీద ఒట్టేసాడు బన్నీ.

"ఉన్న ఒక్క మెమరీనీ నా చేతులతోనే నాశనం చేశానా!" అని లోలోపల కుమిలి మెల్లగా గోడకు జారి కూర్చున్నాడు మాస్టర్.

ఏమి మాట్లాడకుండా సిగరెట్ల మీద సిగరెట్లు కాలుస్తూ ఉన్నాడు.

బన్నీ నెమ్మదిగా దగ్గరికి వెళ్ళి, "మాస్టర్ అదీ... స్లేట్ వరల్డ్ స్కూల్లో యానివర్సరీ ఈవెంట్ అంట, పిల్లలకి డాన్స్ నేర్పించాలట, ఒక మేడం వచ్చి విజిటింగ్ కార్డ్ ఇచ్చి వెళ్లారు."

మాస్టర్ చూపు చుర్రుమంది.

బన్నీ తమాయించుకొని, "మేమలాంటివి చెయ్యం అని చెప్పేశా, ఆమె పట్టుబట్టారు, మీ డాన్స్ అంటే బాగా ఇష్టమట," నసిగాడు బన్నీ.

"ఎవరామె?"

"స్కూల్ కరెస్పాండెంట్ అట, మీ ఏజ్ ఉండొచ్చు. ఎంత అడిగితే అంత ఇస్తామన్నారు."

"మద్యలో నా ఏజ్ ఎందుకురా, నీకు పేమెంట్ ఏమి ఇవ్వట్లేదని ఇది పట్టుకొచ్చావా? ఇక నాకు సినిమాల్లో అవకాశాలు రావు అని ఫిక్స్ అయిపోయావ్ కదా, నీకు నచ్చినవాడి దగ్గరకు పోయి చేరు. పోరా."

బన్నీ బిక్కమొహం వేశాడు.

“అదేం లేదన్నా, నేను ఎప్పుడూ నీతోనే ఉంటా. ఆ మేడంకి గట్టిగా చెప్పా, ఆయన ఎవరనుకున్నారు, నలభై మూవీస్‌కి డాన్స్‌మాస్టర్‌గా చేసాడు, వందల సినిమాల్లో డాన్సర్‌గా చేసాడు, చీప్‌గా స్కూల్ ప్రోగ్రామ్ చెయ్యడు అని.”

మాస్టర్ బన్నీ వైపు తృప్తిగా చూశాడు.

*

గణపతి కాంప్లెక్స్- తిరునాళ్లకో, సంతకో వచ్చినట్టు ఉంటుందక్కడ, మూడు టిఫిన్ సెంటర్లూ, నాలుగు టీ స్టాళ్లు, కళాకారులతో ఉక్కిరిబిక్కిరిగా ఉంటాయి. అక్కడ పరిచయాలు పుడతాయి. అవకాశాలుగా మారుతాయి. ఎన్నో తెలిసిన మొహాలు, తెలియజెప్పే మొహాలు.

అక్కడికి వెళ్తే ఏదైనా హెల్ప్ అవ్వచ్చని ఓమూల లేకపోలేదు. అసిస్టెంట్‌తో కలిసి నేరుగా గణపతికి వచ్చాడు. ఎవరికో ఫోన్ చేసాడు, ఒక రెండు వేలు కొట్టమని. లేవని ఫోన్ పెట్టేసాడు అవతలి వ్యక్తి. మరో రెండు ఫోన్ల తర్వాత ఈపూట కూడా టీనే గతి అని అర్థమయింది. బన్నీ వైపు చూడలేక ఇద్దరికీ టీ చెప్పి తాగుతున్నాడు.

చుట్టూ అనేక గ్రూపుల పిచ్చాపాటి.

అప్పుడే ఓ గ్రూప్ దగ్గరికి వచ్చాడు మేనేజర్ శ్రీనివాస్. అతను చేసిన అనేక సినిమాలకు జాక్సన్ పనిచేశాడు. ఎప్పుడైనా అప్పు కావాలంటే వెంటనే స్పందించే మనిషి. జాక్సన్ అతన్ని చూశాడు. వెళ్లి అప్పు అడుగుదామా లేదా అని తటపటాయిస్తూ నిలబడ్డాడు.

“మొన్న అమృత బార్ దగ్గర తాగి పడిపోయాడన్నావ్ తనే కదా,” ఆ గ్రూపులో ఒకడు.

“అవును. మాస్టర్‌ను తీసుకెళ్లండి అని నేను డ్యాన్సర్‌లకు ఫోన్ చేస్తే ఒక్కడు కూడా రాలేదు, ఏమవుతుందో అని కంగారుపడ్డా. అసిస్టెంట్ వస్తే బైక్ ఎక్కించి పంపించా,” శ్రీనివాస్.

“ఈయన కారు, ఫ్లాట్, అసిస్టెంట్స్- ఎలా మాయం అయ్యాయి?” మరొకడు.

అందరికీ అదో బేతాళ ప్రశ్న.

“ఎవరికి ఏమైతే నీకు ఎందుకురా. మన చొక్కా బొక్కలు చూసుకోము కానీ ఎదుటివాడి చొక్కా మరకలు మాత్రం లెక్కపెడతాం, ఆ మాస్టర్ ఒకప్పుడు మస్త్ బిజీ ఉండేవాడు. పాట క్షణాల్లో కంపోజ్ చేస్తాడు. అతని లెవల్ కూడా వేరులే.

"కారు దిగేవాడు కాదు, ఏం చేస్తాం, దేవుడు చిన్నచూపు చూసాడు," శ్రీనివాస్.

జాక్సన్‌కి ఆ మాటలు వినపడ్డాయి.

'అవును, అవన్నీ ఏమయ్యాయి? నిజమే, దేవుడికి దయలేదు,' తనలో తానే అనుకున్నాడు జాక్సన్.

అప్పుడే ఎర్రటి కారొకటి వచ్చి ఆగింది. ఒకప్పటి అసిస్టెంట్ కిషన్ కార్ దిగి నమస్తే పెట్టాడు.

"మాస్టర్... ఇక్కడ టీ తాగుతున్నారా, ఇక్కడంతా స్క్రాప్ ఉంటారు," అని ఫ్రీగా జాలిని పంచాడు.

'స్క్రాప్... తనని కాదుగా,' అతన్ని ప్రేమగా పలకరించినా ఓవైపు కొరుక్కు తింటున్న అసూయ.

అతను వెళ్లిపోగానే,

"కాస్త అవకాశాలు రాగానే ఒక్కొక్కడికీ బలిసింది, నేనేమో ఉన్న ఒక్క అసిస్టెంట్‌కి ఫుడ్ కూడా పెట్టలేక పోతున్నా, ఛ..." ఆశ్చర్యం, ఆక్రోశం దాచుకోలేక పోయాడు జాక్సన్.

శ్రీనివాస్‌ను పలకరించాడు. అతనికి అర్థమయింది. కొద్దిగా అమౌంట్ ఇచ్చి, "జాక్సన్ నిన్ను ఇప్పటికి పాతిక ఆఫీస్‌లకు పంపించా. ప్రతోడు నీ గురించి ఎంక్వయిరీ చేయడం. తాగి రోడ్లమీద పడిపోతున్నాని ఫీడ్‌బ్యాక్ చెప్పడం. ఇంక నీ మీద ఆశ వదులుకున్నా. పరిస్థితి చూస్తే మరీ బ్యాడ్‌గా ఉంది. సరే, ఓ పని చెయ్. మాదాపూర్‌లో ఓ ఆఫీస్ ఉంది. వెళ్లి నా పేరు చెప్పు. ఇంక ఇదే లాస్ట్."

లాస్ట్... అనేమాట అతన్ని చెంపదెబ్బలా తాకింది. 'నిజంగా ఇదే చివరిదైతే! నేను ఇలాగే మిగిలిపోతానేమో.' ఆ ఆలోచనకే వణికిపోయాడు జాక్సన్.

అతని కళ్లలోని చెమ్మని కనిపెట్టాడు శ్రీనివాస్. "ఏమైంది రా. చెప్పేది విను నేను కూడా యాక్టర్ అవుదామని వచ్చా. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఏం చేద్దాం. బతకాలంటే ఏదో ఒక దారి చూసుకోవాలిగా. దెబ్బకి మేనేజర్ అవతారం ఎత్తా, టాలెంట్ ఉన్నోడివి నువు నాలా కావద్దు జాక్సన్. ఇప్పుడే బయల్దేరు," అని హడావిడి చేసి పంపించాడు.

జాక్సన్, 'ఇది చివరి ప్రయత్నం కాకూడదు. ఎలాగైనా ఛాన్స్ కొట్టాలి,' అనుకుంటూ వెళ్లాడు.

ఆ ఆఫీస్‌లో ప్రొడ్యూసర్‌తో పాటు మరో నలుగురు ఉన్నా సరే మొహమాట పడకుండా ఛాన్స్ అడిగాడు.

ఆయన ఈ మనిషిని చాలాసేపు పరిశీలించాక, "ఇప్పుడంతా యూత్ డాన్స్ కదా, నువ్వేం కంపోజ్ చేస్తావు," అన్నాడు ప్రొడ్యూసర్.

"మోడర్న్‌గా కంపోజ్ చేస్తా సర్," మాస్టర్.

"కుర్ర మాస్టర్‌లు తక్కువకే చేస్తామన్నారుగా," ప్రొడ్యూసర్.

అంటే నేను ముసలోడ్నా? క్షణకాలం చితికిపోయి, "నేను ఒక సాంగ్ ఫ్రీగా చేస్తా సార్, బాగుంటే రెండోదానికి డబ్బులు ఇవ్వండి," అని షో రీల్ చూపించ బోయాడు

"పర్లేదులే ఉంచు. పిలిచినప్పుడు రా. మంచిది మరి," ప్రొడ్యూసర్ తలుపులు మూసేశాడు.

తన పలచటి జుట్టూ, పొట్టా చూసుకున్నాడు జాక్సన్. వచ్చిన ఆవేశం చప్పున చల్లబడింది. శరీరంలో తనవికాని అవయవాలేవో కొత్తగా పుట్టినట్టు వాస్తవం గ్రహింపుకొస్తోంది.

బయటికి రాగానే లాస్ట్ ఛాన్స్ కూడా పూర్తయినట్టే. అంతా అగాధంలా తోచింది. అడుగు వేయడానికి లేదా?

నాలుక పీకుతోంది. ఇది మొదలైతే మెదడును కూడా పనిచేయనివ్వదు.

"ఈవెంట్ ఏ స్కూల్లో అన్నావు?" సన్నని గొంతుతో అసిస్టెంట్‌ని అడిగాడు.

"స్లేట్ వరల్డ్ స్కూల్ అన్నా, షాపూర్‌లో అంట," గట్టిగా అరిచి చెప్పాడు అసిస్టెంట్ బన్నీ.

*

ప్రశాంతమైన స్కూల్ వాతావరణం. బైక్‌ని గ్రౌండ్‌లో నిలిపి నడుస్తూ ఉన్నాడు జాక్సన్. ఈ బడి ప్రాంగణం జ్ఞాపకాలనే కాదు, కొన్ని చిక్కుముడులకి సమాధానాలనూ ఇస్తుందని అతను అనుకోలేదు.

ఎదురుగా ఉన్న చెట్టు నీడలో టిఫిన్ బాక్స్‌తో నెమ్మదిగా నడుస్తోంది ఆమె. నడకలో అదే లయ. తనను ఉక్కిరిబిక్కిరి చేసిన లయ.

'తనేనా? వయసు పెరిగిన చిహ్నంగా లాంగ్ సైట్ లేదుకదా,' తనతో తానే అనుకున్నాడు.

ఆమె రాత్రి ఫోటోలో బూడిదైన మనిషి. తనలో ఫీనిక్స్‌లా మళ్లీ పుడుతున్న మనిషి. పరిగెడుతున్న బాబు వెనుకే ప్రయాణించిన ఆమె చూపు సరిగ్గా జాక్సన్

మీద వాలింది. రెప్ప వేయలేదో, అదే పడలేదో, చూస్తూనే ఉంది. కానీ నిశ్చితంగా నిలబడింది. అతనిలోనే పెద్ద హోరు.

'తనకి ఎన్ని ప్రశ్నలు మిగిల్చింది!'

ఆమె కళ్లలో చెమ్మ. తనే మాట్లాడనీ అని ఊరుకున్నాడు. ఐదు సంవత్సరాల మౌనాన్ని ఆమే ఛేదించాల్సి వచ్చింది.

"ఎలా ఉన్నారూ?"

బహువచనం భారంగా తాకింది.

"మ్, నువ్వా... ఇక్కడ ఉంటున్నావా?" అతని మాటలు నలిగిపోయాయి... మనసులాగే.

"అవును. అటు రా, పేరెంట్స్ అక్కడ కూర్చోవచ్చు," బెంచీలు ఉన్నవైపు చేయి చూపించింది.

వెళ్లి కూర్చున్నారు.

"జో... నిన్ను ఇక్కడ చూస్తానని అనుకోలేదు. అన్నీ గుర్తొస్తున్నాయి," జాక్సన్.

"యా, అవొక వరస్ట్ మోమెంట్స్," ఆమె.

మొహమాటంగా నవ్వాడు.

నిజమే. తన ప్రయాణంలో ఓ మలుపు ఆమె పరిచయం. అప్పటిదాకా అటుగా తిరిగిన టీచర్లు, విద్యార్థులు తిరగడం ఆపేశారు. కాలం తన జ్ఞాపకాలను వెదుక్కుంటూ వెళ్లింది.

*

ఒంగోల్‌లోని వాళ్ల కాలనీలో ఎవరి పెళ్లన్నా, పండగన్నా ఆ కుర్రాడి చిందులే మేజర్ ఎంటర్‌టైన్‌మెంట్. కాలనీ అంతా పూనకం వచ్చేది. బజావో బ్యాంగ్ బ్యాంగ్ అని గ్యాంగ్‌లీడర్ స్టెప్పేస్తే పోటీయే లేదు. ఇంటికెళ్లగానే నాన్న వీపుమీద ఎన్ని దెబ్బలు వేసినా అది తబలా దరువులాగే ఉండేది. ఫలితంగా పది డింకీ కొట్టాడు. టీవీలో చికుబుకు రైలే పాట వస్తుండగా రైలెక్కాడు. రైలు బీట్‌కి ప్రభుదేవాలా ఫీలయ్యాడు. అతని డాన్స్‌కి పిచ్చెక్కిపోయాడు. అతను ఆ స్టైల్ ఎలా సాధించాడు? అని పిహెచ్.డి. లెవెల్ రీసెర్చ్ చేస్తే తేలిన సమాధానం మైకేల్ జాక్సన్ అని. అప్పటినుంచీ జాక్సన్ అయ్యాడు.

సొంతపేరుతో పిలిస్తే పలికేవాడు కాదు. హైదరాబాద్ చేరాక ఎవరైనా మాస్టర్ దగ్గర చేరాలంటే మెంబర్‌షిప్ కార్డు ఉండాలన్నారు. దానికి వేలల్లో సమర్పించు కోవాలి. దొరికిన ప్రతి ఈవెంట్ చేసి తక్కువ టైంలోనే కార్డు సాధించాడు. డాన్సర్

అవ్వగానే, అనేక సినిమాల్లో కాళ్లు చేతులు విరగ్గొట్టుకున్నాడు. జాక్సన్ నాకన్నా బాగా చేస్తున్నాడు. వెనక లైన్‌లో పెట్టు అని హీరోలు అంటే ఏమి చేయాలో అతనికి తెలీలేదు.

అప్పుడే టీవీలో కొత్తగా ఓ డాన్స్ షో మొదలయింది. అది రియాలిటీ షో ట్రెండ్‌కి బీజం. దేవుడే తన కోసం దాన్ని పెట్టినట్టుగా ఫీలయ్యాడు.

అందులో మాస్టర్‌గా ఛాన్స్ మరి. కంపోజింగ్‌లో మజా అప్పుడే తెలిసొచ్చింది. తన కంటెస్టెంట్‌గా వచ్చిన ఆమెని అప్పుడే చూసాడు.

పేరు అడిగితే, 'జ్యో,' అంది స్టయిల్‌గా. అదే ఆకర్షించిందేమో. ఆమె ఒళ్లు విల్లులా ఉంటే, మాట బాణంలా ఉంటుంది. ఆ రిథమ్‌కి, గ్రేస్‌కీ అతని కళ్లు జిగేల్‌మనేవి.

ఆమెతో కలిసి రోజూ నాట్యమే. అతనికి అదో తపస్సు. కొద్దికొద్దిగా పేరు రావడం మత్తుగా ఉంది.

డాన్స్ వేసి వేసి కండరాలు పట్టేసేవి. ప్రాక్టీస్ అయ్యాక కాళ్లు పట్టే అసిస్టెంట్లు. స్ప్రేలు కొట్టే సేవకులతో అతనిది రాజభోగం. అప్పుడప్పుడు జ్యో కూడా కాళ్లు పట్టేది. చూసి నవ్వుకునేవాళ్లు డ్యాన్సర్లు. మొగుడు పెళ్లాలయి పోయారని.

"మాస్టర్ మన గురించి జోకులు వేసుకుంటున్నారు తెలుసా," అంది అతనితో. నవ్వి ఊరుకున్నాడు.

ఇద్దరూ కంపోజింగ్‌లో మరింత ఎక్కువ సమయం గడపటం మొదలైంది.

ప్రాక్టీస్‌కి రెండురోజులు డుమ్మా కొట్టి మూడోరోజు వచ్చాడు జాక్సన్.

అతను లోనికి అడుగు పెట్టగానే ఎదురెళ్లి, "మీరు లేట్‌గా వస్తున్నారు, ఫోకస్డ్‌గా లేనట్టుంది," అంది జ్యో.

చివ్వున చూసాడు, "ఎప్పుడు రావాలో నాకు తెలుసు."

"ఈ షోలో మీతోపాటు నా ఫీచర్, మిగతా డాన్సర్స్ ఫీచర్ కూడా ఉంది," ఆమె రెట్టించింది.

"ఓహో, అయితే మొదలుపెట్టు," అని టక్కున ఆమె చెయ్యి పట్టుకొని మిర్రర్ ముందు నిలబెట్టాడు.

నాలుగు గంటలు నాన్‌స్టాప్‌గా ప్రాక్టీస్ చేయించాడు. అదే వాళ్లిద్దరూ ఒకరి నొకరు క్షుణ్ణంగా పరిశీలించుకున్న సందర్భం. అమె కాళ్లు శరీరం నుంచి విడిపోయి నంత బాధగా మూలిగింది. ఇక వల్లకాక కుప్పకూలిపోయింది. తనకేం పట్టనట్టు వెళ్లిపోయాడు జాక్సన్. అదంతా చూసి అందరూ నోరెళ్లబెట్టారు.

రాత్రి ఎనిమిది అవుతుండగా అతనికి ఆమె నుంచి మెసేజ్ వచ్చింది. ‘‘ఐ యాం డన్, ఐ కాంట్ బేర్ ఆల్ దీజ్ థింగ్స్.’’

తల గోక్కొని అరగంటలో ఆమె రూమ్ ముందు వాలాడు. ఆమె దిగులు దుప్పటిలా చుట్టుకుంది.

అతన్ని చూసి గబుక్కున లేచి నిలబడింది. తలని సరి చేసుకుంది.

‘‘రెస్ట్ సరిపోలేదా, రేపు ఫైనల్,’’ అంటూ ఫుడ్డు, మెడిసిన్స్ ఇచ్చాడు.

‘‘థాంక్స్. ఎక్స్‌పెక్ట్ చేసినదానికన్నా త్వరగానే వచ్చారు.’’

’’ఏంటి?‘‘

‘‘మీకు వినపడింది.’’

కాసేపటి మౌనం తర్వాత, ‘‘సరే, పంతం నెగ్గించుకున్నావు. రేపు వస్తున్నావుగా.’’

తలాడించి ఊరుకుంది.

‘‘ఓకే, నీ గురించి చెప్పు,’’ అన్నాడు.

‘‘ఇన్నాళ్లకి అడగాలనిపించిందా?’’

‘‘ఐ యాం మచ్ ప్రొఫెషనల్,’’ జాక్సన్.

‘‘భుజాలు తడుముకున్నారు. హా... హా...’’ జ్యో.

‘‘అహా, నా గురించి కూడా నువ్ అడగలేదు.’’

‘‘ఐ నో అబౌట్ యు సార్, నా గురించే మీకు తెలియాలి.’’

‘‘యా.’’

‘‘చెప్తా, మేము విజయవాడ నుంచి వచ్చి ఇక్కడే సెటిల్ అయ్యాము. నేను ఇంటర్ చేసా. అమ్మకి నేనంటే ఎంత ఇష్టమో నాకు డ్యాన్స్ అంటే అంత ఇష్టం. దాంతో చదువాపేసా. నా డ్రీమ్ నిజం కావాలని అమ్మవాళ్లు ఎదురుచూస్తున్నారు.’’

అంతా విన్న జాక్సన్ వెళుతూ వెళుతూ అసంకల్పిత చర్యలా ఆమె నుదుటి మీద ముద్దిచ్చిపోయాడు.

ఆమె అలా చూస్తూ ఉండిపోయింది.

ఆ రోజునుంచి ఆ రెండుమనసులు కలిసి కొత్త నాట్యం ఆడాయి. ఖాళీ రోడ్లో రెండుదేహాలు సంభాషించుకుంటాయి. ఆ తర్వాత ప్రతి డాన్స్ షోకి, ప్రతి సినిమాకీ అతని పక్కన జ్యో ఉంది.

‘‘జ్యో... నువ్వు నా పక్కన ఉంటే మిరాకిల్స్ జరుగుతాయి. ఈ అదృష్టం అంతా నీవల్లే.’’

ఆ మాటలకు అతన్ని ప్రేమగా హత్తుకుంది.

అప్పుడు మొదలైంది గొంతుని వోడ్కాతో, బ్రాందీ, విస్కీలతో తడుపుకోవడం. ఎగిరి అలసిపోయిన శరీరానికి, జవజవలాడే కాళ్లకు చుక్క పడితే సమ్మగా ఉండేది. తీపులు తీరిపోయేవి. అది పది చుక్కలు... వేలకు వేల చుక్కలుగా మారింది. నిబద్ధతను మత్తు జగత్తులో పడుకోబెట్టడం మొదలయింది. క్రమంగా సంవత్సరం గడిచిపోయింది. వస్తాయనుకున్న ఛాన్సలన్నీ ఏమైపోయాయో అతనికి అర్థం కాలేదు. సమయాలన్ని బార్‌లోనే గడిచాయి.

ఆ సాయంత్రం తాగుతుండగా ఫోన్ మోగింది.

"ఛాన్సులు రాలేదని నిన్ను నువ్వు పనిష్ చేసుకుంటున్నావా?" ఫోన్‌లో జ్యో.

అతను మాట్లాడలేదు.

"అబ్సెస్ అవ్వకు, బీ పేషెంట్, నువ్వు మాస్టర్ అవుతావు, నాకు నమ్మకం ఉంది," మళ్లీ ఆమె ఓదార్పు.

జాక్సన్ తప్పు చేసిన పిల్లాడిలా నిలబడ్డాడు.

ఇంకో మాట ఎక్కువ మాట్లాడితే బరస్ట్ అయ్యేలా ఉన్నాడు.

అతని భుజం మీద చేయి వేసి, "జాక్సన్ నువ్వేమీ అనుకోనంటే నేను ఒక ఐడియా చెప్పనా? మనం ఒక డెమో చేద్దాం, దాంతో హీరోలనీ, మేనేజర్‌లనీ కలువు."

"ఐ యాం ఆల్రెడీ ఎప్రూవ్డ్ కొరియోగ్రఫర్, పిల్లాడిలా డెమో చేయాల్సిన కర్మ నాకేంటి?" అరిచాడు.

"ప్రపంచం గుర్తించనంతవరకు ప్రతిభ ఉన్నా లేనట్టే," సూటిగా అంది.

అతని మౌనమే అంగీకారం అయింది.

*

'జియాజలే జాన్ జలే, నైనో తలే దువా చలే, రాత్ భర్ దువా చలే...'

దిల్ సే పాటకి డెమోలో శృంగార రసాన్ని ఒలకబోసారు జాక్సన్ అండ్ జ్యో. అప్పటినుంచీ అతనిలో తరచూ మృదుత్వం చూస్తోంది. అదామెకి నచ్చింది కూడా. డెమో పుణ్యం. ఒక్కసారిగా మూడు చిన్న సినిమాలు దొరికాయి. ఉప్పొంగింది జ్యో. అతని గెలుపులో తానున్నందుకు.

"వావ్, కంగ్రాట్స్, ఎన్నో వేలమంది కల ఏ ఒక్కడికో తీరుతుంది. అది నువ్వయ్యావు..." అంది.

ఇద్దరిలో ఏదో ఉద్వేగం.

జ్యో కళ్లనిండా నీళ్లు.

తొలి పాట షూటింగ్ అరకులో మొదలైంది. ఎంత ప్రయత్నించినా ఆ హీరోకు కాలు కదిలేది కాదు.

"ఏదో సినిమాలో పిడకల డాన్స్ చేసినట్లు, పాలు పితికే డాన్సు, అష్టాచమ్మా డాన్సు పెట్టాలి," తల పట్టుకున్నాడు.

కిలకిలా నవ్వింది జ్యో.

మూడేళ్లలో ముప్పై సినిమాలు. అప్పటిదాక లోటు అయినవన్నీ ఇంటికి చేరాయి.

ఇళ్లు, కార్. అన్నిటి సెలక్షన్ జ్యోదే.

అతని ఖర్చుల గురించి ఆలోచించే అవసరం లేకుండాపోయింది. ఇద్దరి ఫ్యూచర్‌ని ఎంతో గొప్పగా ఊహల్లోనే నిర్మించుకుంది. ఈ క్రమంలో తను మాస్టర్ కావాలి అన్న సంగతి మరచిపోయింది.

ఆరోజు ఫస్ట్ టైం స్టార్ హీరోతో సాంగ్ షూటింగ్. రాత్రి తాగిన మత్తు దిగలేదు. మత్తుమత్తుగా షూటింగ్‌కి వెళ్లాడు. సోయి లేకుండా పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్న అతని వాలకం చూసి ప్రొడ్యూసర్ మెడపట్టి బయటకు గెంటేశాడు. విషయం సెట్‌లో ఉన్నవాళ్ల పుణ్యమా అని ఇండస్ట్రీ మొత్తం పాకింది. నెలలుగా మరోపిలుపు లేదు. జ్యో అతనిలో కొత్తమనిషిని చూస్తోంది.

పట్టరాని కోపంతో, "జాక్సన్ నీకేమైంది, తాగుబోతులా తయారయ్యావు," జ్యో.

అతనూ తగ్గలేదు. "ఏం మాట్లాడుతున్నావు, వాళ్లకి నా టాలెంట్ చూసి కుళ్లు. వాళ్లకు నచ్చినవాళ్లకి ఇవ్వడానికి నన్ను కట్ చేశారు."

"ఇలా చెప్పి నిన్ను నువ్వు మోసం చేసుకోకు. తాగి రచ్చ చేస్తే ఎవరు మాత్రం భరిస్తారు. కొంచెం కూడా సిగ్గుగా లేదూ."

ఆమె చెంప చెళ్లుమంది. దిగ్భ్రమతో చూసింది జ్యో.

"ఎందుకు కొడతావ్. నేనేమైనా నీ పెళ్లాన్నా?"

అతను సమాధానం చెప్పలేదు.

ఆ తరువాత ఆమె శరీరాన్ని ప్రేమగా పలుమార్లు, కోపంతో పదులసార్లు తడిమాడు. భరిస్తుందనుకున్నాడు. ఆమె ఇష్టపడింది బహుశా అతన్ని కాదేమో, అతని కళని, ఆ అసమానప్రతిభని. కొన్నిసార్లు బాధ కోపానికి లీడ్ చేసినట్టు, కోరికని ప్రేమగా

భ్రమపడినట్లు, నృత్యంమీద ఇష్టం అతనిమీద అనుకొని ఉండచ్చు. ఒకటి మరొకటిగా అనిపించే కలబోత భావాలు.

ఒకరోజు ఆమె షూట్‌కి వెళ్లబోతే, ''నువ్వు ఇక వేరే మాస్టర్స్ సాంగ్స్‌కి వెళ్లద్దు,'' ఆర్డర్ వేసాడతను.

''వాట్! నీలాగే నేను బెస్ట్ డాన్సర్.''

''ఎవరో బైక్ మీద నువు ఎక్కాల్సిన పనిలేదు.''

''ఓహ్, అదా నీ ప్రాబ్లం. నా ఇష్టం,'' బ్యాగ్ నేలకి విసిరేసి బయటకు వెళ్లి నిలబడింది. వర్షించే ఆమె కళ్లు. మూతి బిగబట్టి మెట్ల మీద కూర్చుంది. జ్యో మదిలో అతని మాటలు మళ్లీ మళ్లీ నిప్పుతుంపరలా రేగుతున్నాయి.

''నువ్వు పక్కనుండటం వల్లే నాకు దరిద్రం పట్టుకుంది. పైగా నన్నే పాయింటవుట్ చేస్తున్నావ్,'' ఆమెని రెచ్చగొట్టాడు.

''ఇంక ఆపు, నీ ఫెయిల్యూర్‌కి నన్ను కారణంగా చూపించకు,'' జ్యో.

''నేను ఫెయిల్ అయ్యేసరికి నామీద ప్రేమ పోయిందా? నేను సక్సెస్ అవుతా అనే కదా నన్ను పట్టుకున్నావు.''

''వాట్, పట్టుకున్నానా, ఇదేమన్నా బిజినెస్సా. నువ్వు తాగుబోతులా మాట్లాడుతున్నావ్. ఛ,'' ఒళ్లంతా కంపరమెత్తినట్టు విదిలించింది జ్యో.

''పోతే పోవే, గడిచినంత కాలం నా దగ్గర తిని ఇప్పుడు హ్యాండ్ ఇచ్చావ్, ఈ అమ్మాయిలే ఇంత. సెల్ఫిష్ మొహాలు,'' జాక్సన్.

ఆ మాటలకు తెలీని భయాలు ఆమెని చుట్టేస్తున్నాయి. వాళ్లిద్దరి కలల రెక్కలు విరిగిపడ్డాయి. చుట్టూ వాటి శకలాలు. ఆమె కన్నీటి నీడలు.

*

1... 2... 3... 4... మూమెంట్ అని రిథమ్ లేకుండా ఎగురుతున్నాడు.

గణపతి కాంప్లెక్స్ దగ్గర ఓ ఆడిటోరియంలో ప్రాక్టీస్.

జ్యోను మర్చిపోడానికి డాన్స్ ఒక డ్రగ్. ఒళ్లు హూనం అయ్యేలా, ఎముకలు విరిగేలా ఎగురుతున్నాడు. యుద్ధంలో పోరాడినవాడిలా అలసిసొలసి ఉన్నాడు జాక్సన్.

జ్యో అతనినుంచి దూరం జరిగింది. అప్పటిదాకా కన్న కలలు చెదిరి పోయాయి. ఇక కొత్త కలలు కనాలి. ఎక్కడనుండి మొదలుపెట్టాలో, ఏం చేయాలో ఆమెకి తెలియడం లేదు. ఆ అపార్ట్‌మెంట్‌లో కొత్త వాతావరణం, కొత్త మనుషులు. తిండి సయించలేదు. నిద్రపట్టక ఆలోచిస్తూ కూర్చుంది. ఏ అర్ధరాత్రికో కింద గొడవ

మొదలైంది. వెళ్లి చూస్తే జాక్సన్. ఒక్కసారిగా ఆమెకి వొళ్లు చల్లబడింది. రాత్రి కాగానే తాగి ఆమె ఫ్లాట్ దగ్గరికొచ్చాడు.

"జ్యో, రావే బైటికి. నేను చేతకానివాణ్ణి అనుకుంటున్నావా. నీకోసం వెళ్లి ఎవడి కాళ్లో పట్టుకోవాలా, టాలెంట్‌తో పనిలేదా? ఎవడైనా నా దగ్గరికి రావాల్సిందే. అన్నీ తెలిసి కూడా వెళ్లిపోతావా, నీయబ్బ, రావే ఇటు."

అర్ధరాత్రి అపార్ట్‌మెంట్స్ ముందు గోల గోల చేస్తున్నాడు.

ఆమెని అపార్ట్‌మెంట్‌వాసులంతా అదోలా చూసారు.

వాచ్‌మెన్‌తో, "వీడ్... ఉందా? ఉంటే ఇవ్వవా?" అంటూ ఊగుతున్నాడు.

వీడ్... మొదట అర్థం కాకున్నా అతని ప్రత్యేకమైన వాసనకు అర్థమైంది, గంజాయ్ కొడుతున్నాడని. ఉబికే దుఃఖాన్ని పంటిబిగువున పట్టింది.

"అర్ధరాత్రి న్యూసెన్స్ ఏమిటి?" ఇంటి ఓనర్, పక్కింటివాళ్లు చిరాకుపడ్డారు.

ఓనర్ చొక్కా పట్టుకున్నాడు జాక్సన్. అదే అతను చేసిన తప్పు. పదినిమిషాల్లో పోలీస్ స్టేషన్‌లో కూర్చున్నాడు. ఇరుగుపొరుగు చెడామడా తిడుతుంటే జ్యో పక్కన కుర్చీలో తలవంచి కూర్చుంది. ఇలాంటిరోజు తను ఎప్పుడూ ఊహించలేదు.

"ప్లీజ్ సార్, ఏదో డ్రింక్ చేసి ఉన్నాడు, అందుకే అలా బిహేవ్ చేశాడు. వదిలేయండి సర్," పోలీసులను బతిమాలింది.

"మనిషికి భయమన్నా ఉండాలి, లేదా బాధ్యతన్నా ఉండాలి. ఇతనికి రెండూ లేవు. రెండ్రోజులుంటే అన్నీ వచ్చేస్తాయి," స్టేషన్ ఎస్ఐ.

ఎవరికి ఫోన్ చేయాలో అర్థంకాలేదు. ఒంటరిగా పోలీస్ స్టేషన్‌లో తనమీద తనకే జాలి పుట్టింది. అతన్ని నమ్మిన ప్రతిసారీ దెబ్బ తగులుతూనే ఉంది.

అప్పటిదాకా గడిచిన జీవితాన్ని విరక్తిగా నెమరు వేసుకుంది జ్యో. బహుశా అది ఆ అంకానికి ఫుల్‌స్టాప్ కావచ్చు.

*

విజయవాడ బస్ వెళ్తూ ఉంది. జ్యో తనకు సంబంధించిన జ్ఞాపకాలన్నిటికీ దూరంగా సాగుతోంది. బస్సులో ఉండగా మేనేజర్ శ్రీనివాస్ కాల్, ఒక ఆపర్చునిటీ ఉందని. ఇష్టం లేకున్నా జాక్సన్‌కి ఫోన్ చేసింది.

అసిస్టెంట్ కిషన్ ఫోన్ తీశాడు. "రాత్రంతా అన్న నీకోసం బైక్ మీద తిరిగాడు, ఎక్కడో పడ్డాడు, మొత్తం దెబ్బలే," అన్నాడు కూల్‌గా.

ఆమె గుండె జల్లుమంది. బరువైన గుండెతో మళ్లీ పరిగెత్తింది జ్యో.

‘అంత తపన పడ్డాడంటే ఈసారైనా నిలబడతాడేమో. ఈ ఒక్క ఛాన్స్‌తో పోయిన జీవితాన్ని తిరిగి ఎందుకు పొందలేము.’ ఇలా ఆలోచిస్తూ అతని ఫ్లాట్‌కి వచ్చింది.

సోఫాలో సిగరెట్ తాగుతూ తాపీగా ఉన్నాడు జాక్సన్.

ఒక్కసారిగా ఏమీ అర్థంకాలేదు.

“కిషన్ నీకు యాక్సిడెంట్ అయింది అన్నాడు!” అయోమయంగా అంది.

దానికతను, “నువ్వు ఊరికి వెళ్లిపోతున్నావని తెలిసింది. నువ్వెక్కడ నాకు దూరంగా పోతావో అని అలా చెప్పించాను. నేను ఎన్నిసార్లు వదిలేసినా నువ్వు మాత్రం నన్ను నమ్ముతూనే ఉన్నావు. ఈసారి నీ నమ్మకాన్ని పోగొట్టుకోను. నువ్వుంటే నాకు ధైర్యంగా వుంటుంది.”

అతని కళ్లలో మునుపటి ధైర్యం ఆమెకి కనబడలేదు. అతని బేలతనానికి మళ్లీ ఆమెలో జాలి తొంగిచూసింది. దగ్గరికి రావడానికి రెండు అడుగులు వేసింది. వంటగదిలో చప్పుడు. ఆమ్లెట్ వాసన. ఆ గదిలో ఆమె స్థానంలో మరెవరో ప్రయోగాలు చేస్తున్నారు. ఆ కొత్తపిల్లని చూసింది. అలాంటి ప్రయోగాలు ఈమధ్య రోజుకొకరు చేస్తున్నారని ఆమెకు తెలియదు.

“ఎవరామె?” జ్యో.

“కొత్త కుక్,” జాక్సన్.

ఆ జుట్టుకి బర్గండీ కలర్, టాటూలు, స్ట్రెచబుల్ డ్రస్ చూస్తే తెలిసిపోతుంది ఆమె కుక్ కాదని, డ్యాన్సర్ అని.

“ఇంకా నమ్ముంటావా?”

అతను మాట్లాడలేదు.

“సాటి కళాకారులకి కనీసం విలువ కూడా ఇవ్వవా? ఛీ,” దగ్ధమయ్యేంతటి ఎర్రటిచూపు చూసి వెళ్లిపోయింది.

అదే ఆఖరు. తర్వాత అతని గురించి ఫిల్మ్ సర్కిల్‌లో ఎవరూ మాట్లాడు కోలేదు.

*

అప్పుడు పోయిన మనిషి మళ్లీ ఇప్పుడు కనపడింది. బడిలో మధ్యాహ్నం గంట కొట్టారు. పిల్లలు క్లాసుల నుంచీ, అతను జ్ఞాపకాల నుంచీ బయటికి వచ్చారు. నాలుగేళ్ల బాబుకి తినిపించి చేయి కడిగింది జ్యో. ఆ తతంగం మొత్తం ఓ ధ్యాసలో

చూస్తున్నాడు. వయసుతోపాటు పెరిగిన పరిణతి తనలో. విరిగిన రెక్కల నీడలు అతనిలో.

“అసలు నువ్వు ఏమయ్యావు? ఆ తర్వాత నీకు చాలా ట్రై చేశా,” జాక్సన్.

“నీ నిర్లక్ష్యంతో నీ ఫ్యూచర్‌నే కాదు, నా లైఫ్‌ని కూడా స్పాయిల్ చేసావు. నా యాంబిషన్ పోయింది. యూ నో. ఆరోజు మేనేజర్ శ్రీనివాస్ నీకో ఆపర్చునిటి రిఫర్ చేద్దాం అనుకున్నాడు. హీరోగారు నీతో మాట్లాడాలి అనుకున్నారు. అతను నీకో హోప్ ఇవ్వాలనుకున్నాడు. కానీ నువ్...” జ్యోకి మాట రాలేదు.

అతను బిత్తరపోయాడు. నా కలల చితికి నేనే నిప్పు పెట్టుకున్నాను, కంట చిన్న తడి. ఏదో వైరాగ్యం.

“ఏమైంది?” జ్యో.

తనలో నచ్చేది నచ్చనిది అదే. క్షణాల్లో నిర్ణయాలు తీసుకునే శక్తి.

“నువ్వెళ్లిపోయక తెలిసింది, ఒంటరితనం, ప్రేమను మిస్ అవ్వడం, ఓటమి, నిరాశా ఇవన్నీ ఎలా ఉంటాయో,” జాక్సన్.

దిగ్గున తలెత్తి చూసింది. అతను కొనసాగించాడు.

“తెలియకుండానే ఏళ్లు గడిచిపోయాయి. ఇన్నేళ్లలో ఎన్నోసార్లు నీ గురించి వెతికాను. ఊరికి వెళ్లిపోయి ఉంటావ్ అనుకున్నాను. తర్వాత ఎవరో చెప్పారు, ఒకటి రెండు టీవీ షోలు చేశావని, యూట్యూబ్‌లో ఉన్నాయేమోనని వెతికాను, దొరకలేదు, నువ్వయినా మంచి మాస్టర్ అవుతావనుకున్నాను.”

జ్యో చాటుగా కళ్లు తుడుచుకొని అతన్ని చూసి, “నేను మాస్టర్ కాలేనని నాకూ అప్పుడే తెలిసింది. ఛాన్స్ కోసం ఎక్కడికెళ్లినా నీ పేరు చెప్పగానే తలుపులు మూసుకునేవి. నీకు ఎఫైర్స్ ఎక్కువనీ, సిన్సియారిటీ లేదని చెప్పుకుంటున్నారు. అందరినీ పగ చేసుకున్నావు. వాళ్లు నేను నీ భార్యని అనుకున్నారు, నాకు ఛాన్స్‌లు ఇవ్వాలో లేదో వాళ్లకే తెలీదు. అన్నీ చూసి ఇక అలసిపోయాను,” కళ్లు మూసుకుంది.

జాక్సన్, “సో, నీకు ఛాన్స్‌లు రాకపోవడానికి నేనే కారణమా?”

“ఇన్‌ఫాక్ట్ అదొక్కటే కాదులే, నేను నిన్ను ఎన్నిసార్లు నమ్మినా అన్నిసార్లు మోసపోయాను. ప్రొఫెషనల్‌గానే కాదు. పర్సనల్‌గా కూడా, తప్పు నాదే,” తల అడ్డంగా ఊపి లేచింది. ప్రిన్సిపాల్ గది వైపు నడిచింది. ఫాలో అయ్యాడు. ప్రిన్సిపాల్ ఛైర్‌లో కూర్చున్న వ్యక్తికి పరిచయం చేసింది.

“వివరాలు మీరు మాట్లాడండి,” అంటూ హడావుడిగా వెళ్లిపోయాడు ప్రిన్సిపాల్.

వెళ్లి అదే సీట్‌లో కూర్చుంది జ్యో. అతనికి అర్థమైంది.

ఇక అక్కడి ఈవెంట్ గురించి మాట్లాడే మాటలు అతని బుర్రలోనించి ఎగిరిపోయాయి. ఇంకేమైనా చెపుతుందేమో అని చూసాడు. అతని ప్రశ్న చదివింది.

"నువ్వు అడగని ప్రశ్నకు సమాధానం చెప్పాలి. వరంగల్‌లో కల్చరల్ ఈవెంట్‌లో భరతనాట్యం చేస్తుంటే చూశాడట తను, అంతే. పెళ్లి చేసుకుంటావా అని అడిగాడు. జీవితంతో ప్రయోగాలు చేయాలని నాకు లేదు. సో..."

చాలాసేపు ఇద్దరూ ఏమీ మాట్లాడలేదు.

మాట సొఫిస్టికేటెడ్‌గా మార్చి, "నీ కెపాసిటీ గురించి నేను మా సార్‌కి ఎస్టిమేషన్ ఇవ్వాలి, నా ఫ్రెండ్ అని, నీ సినిమాలు, ట్రాక్ రికార్డ్ గురించి చెప్పాను. ఇలాంటి టైంలో సాయపడాలి అన్నాడు."

మళ్లీ నమ్మి ఒక అవకాశం.

"ఎన్ని దురదృష్టాలు కలిస్తే ఇలా అవుతుంది?" అన్నాడు.

ఇక అన్నిటికీ తలొగ్గినట్టు ఉన్నాడు.

"నీ పతనానికి కారణం ఎవరో నీకు తెలుసు," అని ఈవెంట్ అగ్రిమెంట్ పేపర్స్ ముందు పెట్టింది.

'ఎవరూ!' కిందికి చూసాడు.

అగ్రిమెంట్‌లో తన పేరే చూపిస్తోంది.

*కొత్తకథ*
*మే 2022*

✻



26 ఆగస్ట్ 1992న ప్రకాశం జిల్లాలో పుట్టిన **చరణ్ పరిమి** మొదటి కథ ప్రేమ పిలుపు ఫిబ్రవరి 2017 తెలుగు వెలుగులో అచ్చయ్యింది. దాదాపు 25 కథలు ప్రచురించారు. వివిధ పత్రికల్లో కొన్ని వ్యాసాలు రాశారు. కేరాఫ్ బావర్చీ కథాసంపుటి వెలువరించారు. కొంతకాలం జర్నలిస్టుగాను, కార్టూనిస్టుగాను పనిచేసి, ప్రస్తుతం సినిమాల్లో అసోసియేట్ డైరెక్టరుగా ఉన్నారు. నివాసం హైదరాబాదు.

***చిరునామా:** ఇం.నెం. 731, ఆర్ & బి బంగ్లా రోడ్, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా - 523 327.*
*ఫోన్: 89850 95040* **cartoons.charan@gmail.com**